

## కేటీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా కన్వీనర్ జుబేర్

మెదక్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ జుబేర్ అహ్మద్ సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఏడు నెలల పెండింగ్ పీఎఫ్ ఇవ్వండి



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రామాయంపేట, జనవరి 20: తమకు వచ్చే 7నెలల పెండింగ్ పీఎఫ్‌ను వెంటనే ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేట పురపాలిక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏడు నెలలుగా తమకు డబ్బులు ఇవ్వకుండా పురపాలిక కమిషనర్, సిబ్బంది కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు పీఎఫ్ ఇస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కార్మికులకు పీఎఫ్ ఇవ్వకుండా చేస్తున్నదన్నారు.

## బీడీ కార్మికులకు పింఛన్ పెంచాలి

రామాయంపేట, జనవరి 20: బీడీలు చేసి రాజీనామా చేసి కార్మికులకు పింఛన్ వెయ్యి నుంచి 8 వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. దశాబ్దంగా బీడీ కార్మికులంటేనే ప్రభుత్వాలు మరిచిపోయాయని, ఓట్లకోసం వచ్చే నాయకులు తమ సమస్యలు ఎందుకు పట్టించుకోరని మండిపడ్డారు. కార్మికులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలన్నారు.

## రైలు ఎక్కుతూ జారిపడి ఒకరికి గాయాలు



గాయపడ్డ సురేశ్

రామాయంపేట, జనవరి 20: రైలు ఎక్కుతూ జారిపడిన ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన సురేశ్ కొన్నేండ్లుగా రామాయంపేటలో అడ్డా కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన స్వగ్రామానికి వెళ్లేందుకు అక్కన్నపేటలో రైలు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో కాలు జారడంతో కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్సలు అందించారు.

## నట్టల నివారణ మందులు పంపిణీ

శివ్వంపేట, జనవరి 20: మండలంలోని కొత్తపేట గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో మండల పశువైద్యాధికారి సంధ్య ఆధ్వర్యంలో పశువులకు సోమవారం నట్టల నివారణ మందులు వేశారు. గ్రామంలోని ఆవులకు చుడి పరీక్షలు, గేదెలకు కృత్రిమ గర్భధారణ, నట్టల నివారణ మందులు వేశారు. అధిక పాల దిగుబడి ఇచ్చే పాడి పశువుల రైతులు ముగ్గురిని ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవో పవన్‌కుమార్, ఓఎస్ లక్ష్మణ్, గోపాల మిత్ర ప్రకాశ్ ఉన్నారు.

## చేగుంటకు కళాకారుల మహాయాత్ర

చేగుంట, జనవరి 20: మందకృష్ణ మాదిగకు మద్దతుగా చేపట్టిన కళాకారుల మహా రథయాత్ర చేగుంట మండలం బోనాల్‌కు సోమవారం చేరుకున్నది. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల నిరసన కార్యక్రమం విజయవంతం చేసే వరకు ఈ రథయాత్ర కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు యాదగిరి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు

నిజాంపేట, జనవరి 20: నిజాంపేటలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కళామండలి అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో మండల కమిటీ ఏర్పాటైంది. మండల అధ్యక్షుడిగా అమర్, ఉపాధ్యక్షులుగా రాము, రాజు, కోశాధికారిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా పాపిరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల సభ్యులు సుధాకర్, సిద్ధిరాములు, రామస్వామి, రాజయ్య తదితరులు ఉన్నారు.

## ఔదార్యం చాటుకున్న యువకులు

రామాయంపేట రూరల్, జనవరి 20: మండలంలోని దామరచెర్వు గ్రామానికి చెందిన యువకులు గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. రూ.5 వేలు గెలుపొందిన బీఎస్ టీం గ్రూప్ సభ్యులు తమ స్నేహితుల జ్ఞాపకార్థం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో ప్లేట్లు పంపిణీ చేశారు.


## విద్యార్థులకు నాణమైన భోజనం అందిస్తున్నాం



మెంతి కూర సాగు

చిన్నశంకరంపేట, జనవరి 20: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేస్తున్నామని చందాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. పాఠశాల ఆవరణలో పాలకూర, తోటకూర, మెంతికూర, కొత్తిమీర, గంగవాయిలకూర పెంచుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఈ ఆకుకూరలనే వండి పెడుతున్నారు.

## మానసికఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య



సహస్ర (ఫైల్)

తూప్రాన్, జనవరి 20: పరీక్షలు దగ్గరపడుతుండటంతో మానసిక ఒత్తిడితో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన సహస్ర (15) స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. పరీక్షలు దగ్గర పడుతుండటంతో మానసిక ఒత్తిడికి గురైంది. దీంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట,జనవరి 20: పట్టణానికి చెందిన సౌజన్య, బాలు దంపతుల కూతురు మానస అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న సౌజన్య మిత్రులు మాజీ సర్పంచ్ నరేశ్, మురళి, నర్సింహులు, ఎల్లం ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



14వ వార్డులో బోర్ మోటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నాగులపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- నీటి ఎద్దడిని తీర్చడానికి బోర్ మోటర్ ఏర్పాటు

నర్సాపూర్, జనవరి 20: నీటి ఎద్దడిని తీర్చడానికి బోర్ మోటర్ వేయించినట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ 14వ వార్డులో నీటి ఎద్దడి నివారించేందుకు ఎమ్మెల్యే బోరు మోటర్ వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీలో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి పరిష్కరించాలన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పట్టణవాసులకు సూచించారు.

### నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు పాటించాలి

మున్సిపాలిటీలోని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేను పాలక వర్గం ఘనంగా సత్కరించారు. అనంతరం తాగునీటి సమస్య, పురపాలక సంఘం దుకాణాల బహిరంగ వేలం, అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపు పై చర్చించారు.

### రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

మండలంలోని మూసాపేట్ గ్రామం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తౌర్యాతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి ఐదు లక్షల నిధులు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. నాడు రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో గిరిజన తండావాసులకు రవాణ సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్ సరితాఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, నాగులపల్లి మాజీ సర్పంచ్ సేనాధిపతి, కౌన్సిలర్ రాంచందర్, నాయకులు షేక్‌హుస్సేన్, సూరారం నర్సింహులు, జగపతి, జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# కెనాల్ పనులు త్వరగా పూర్తిచేయాలి

### దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 20: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కెనాల్‌కు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలువలకు సంబంధించి కాంట్రాక్టర్లతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. దుబ్బాక నియోజక వర్గంలోని పెండింగ్‌లో ఉన్న అన్ని కెనాల్ పనులు త్వరగా పూర్తి చేసి, కాలువల ద్వారా రైతులకు సాగు నీటిని అందించాలని సూచించారు. మిరుదొడ్డి కెనాల్ పనులు పూర్తిచేసి, చేగుంట మండలానికి త్వరగా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, రాయపోల్ రాజిరెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

### 21నుంచి 23 వరకు గ్రామల్లో సభలు

ఈనెల 21 నుంచి 23 వ తేదీ వరకు చేగుంట, నార్సింగి మండలాల్లోని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చిన్నరెడ్డి, నార్సింగి ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో చేరికలు, పథకాల లబ్ధి కోసం చేగుంట మండలంలో ఈనెల 21న గొల్లపల్లి, ఇబ్రహీంపూర్, జెత్రాంతండా, కరీనగర్, కసాన్‌పల్లి, పోతాన్‌శెట్టిపల్లి, రాంపూర్, సోమ్లాతండా, ఉల్లితిమ్మాయిపల్లి, వల్భాపూర్, 22న చిన్నశివునూర్, చిట్టోజిపల్లి, కర్నాల్‌పల్లి, పోతాన్‌పల్లి, పులిమామిడి, రెడ్డిపల్లి, రుక్మాపూర్, వడియారం, 23న అనంతసాగర్, బీ కొండపూర్, బోనాల్, చందాయిపేట్, చేగుంట, చెట్ల తిమ్మాయిపల్లి, మక్కరాజిపేట్, నడిమితండా, పెద్దశివునూర్, పొలంపల్లి, నార్సింగి మండలంలో 21న నర్సంపల్లి, పెద్దతండా, సంకాపూర్ తండా, భీంరావ్‌పల్లి, 22న వల్లూర్, నర్సంపల్లి, శేరిపల్లి, నార్సింగి,23న సంకాపూర్,జెప్తిశివునూర్ గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే

- మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి
- అంత్యక్రియలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం

నిజాంపేట, జనవరి 20: మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజు కుమారుడు సురేశ్ (27), నార్సింగి వడ్డెర కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బచ్చురాజ్‌పల్లికి చేరుకుని సురేశ్ మృతదేహానికి నివాళులర్పించారు. తక్షణ సాయంగా మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల చొప్పున బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం కంఠారెడ్డి తిరుపతిరెడ్డి చల్మెడలో అనారోగ్యంతో మృతి చెందిన దుర్గయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ సంగుస్వామి, మాజీ ఎంపీటీసీలు చింతల స్వామి, బాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, నాయకులు కిష్టారెడ్డి, స్వామి,న రేందర్‌నాయక్, రాములు, మావురం రాజు, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్, రాజు, నగేశ్, అనిల్, బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.



మృతదేహానికి నివాళులర్పించి, మృతుడి తండ్రిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



సురేశ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

# నమ్మించి వంచించిన కాంగ్రెస్ సర్కారు



సమావేశంలో మాట్లాడుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



అల్లాదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- పెట్టుబడి లేక యాసంగిలో పంట వేయలేని దుస్థితి
- రూ.15వేల రైతు భరోసాకు దిక్కులేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించడంతోనే రుణమాఫీ
- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

అల్లాదుర్గం, జనవరి 20: ప్రజలను నమ్మించి కాంగ్రెస్ వంచిస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. రూ.15 వేలకు బదులుగా రూ.12 వేలు ఇస్తామని రైతన్నకు వెన్నుపోటు పొడిచిందన్నారు. సోమవారం ఈ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అల్లాదుర్గం మండల నాయకుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అల్లాదుర్గం బస్టాండ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఎకరానికి రూ.10 వేల రైతుబంధు ఇచ్చిందన్నారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని మాయ మాటలతో రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతు భరోసా ఇవ్వకపోవడంతో యాసంగిలో పంటలు వేయలేని దుస్థితి నెలకొందన్నారు. రైతు రుణమాఫీ కూడా మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించడంతోనే ఆ కొందరికైనా వచ్చిందన్నారు. కల్యాణలక్ష్మి పేరిట రూ.లక్ష నగదుతోపాటు ఇస్తామన్న తులం బంగారం ఊసే లేదన్నారు. ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సైతం నియోజకవర్గ ప్రజల బాగోగులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిరసనలో పార్టీ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, డీబీ నాగభూషణం, పైతర సాయికుమార్, వెంకటేశం, వీరారెడ్డి, టేక్మాల్, పార్టీ అల్లాదుర్గం మండల అధ్యక్షుడు బత్తుల వీరప్ప, పల్లెగడ్డ నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు అంజియాదవ్, నాయకులు సాయికుమార్, మోహన్‌రాథోడ్, భాస్కర్, రవి, శివరాం, లక్ష్మయ్య, నాగరత్నం, కృష్ణ, బేతయ్య, రామాగౌడ్, పవన్, నర్సప్ప, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- అదనపు కలెక్టర్ నగేశ్
- ప్రజావాణిలో 102 దరఖాస్తులు స్వీకరణ

మెదక్, జనవరి 20(నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 102 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ధరణి-38, ఇందిరమ్మ ఇండ్లు-11, రుణమాఫీ-3 రేషన్ కార్డులు-10, ఇతర సమస్యలు -40 సంబంధించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు స్వీకరించారు. దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి సిఫారసు చేశారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

### అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, జనవరి 20: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్సై, సీఐలకు సమస్య స్థితిని తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

## బాలిక సాధికారత దిశగా జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

### బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలి : అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): బాలిక సాధికారత దిశగా జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిక కేంద్రం, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, అదనపు ఎస్పీ మహేందర్ తదితరులతో కలిసి సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శాఖల సమన్వయంతో ఆడపిల్లల ఎదుగుదలకు చైతన్యం తీసుకురావాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో గ్రామాల్లో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టపరమైన సంరక్షణ కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్షపై అవగాహన కల్పించాలన్నారు. బేటీ బచావో బేటీ పడావో పథకం పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలకు కార్యాచరణ చేయాలన్నారు. బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగించేలా అధికారులు కార్యక్రమాలను తయారు చేయాలని తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, సీడీపీవోలు, సఖి మహిళా సాధికారత బృందాలు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా బీఆర్టీయూ

### బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం



బీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శివ్వంపేట, జనవరి 20: రాష్ట్రంలో కార్మికులకు బీఆర్టీయూ అండగా ఉంటుందని బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో బీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. పదేండ్ల కాలంలో కార్మికులను కేసీఆర్ ప్రభుత్వం కడుపులో పెట్టుకుని చూసుకున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల వేతనాలు ఇవ్వకుండా వారి బతుకులు రోడ్డు పడేసిందని అన్నారు. నెలనెలా వేతనాలు ఇవ్వకుంటే బీఆర్టీయూ పక్షాన రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### కలెక్టర్ రాహుల్ రాజ్



సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్ రాజ్

టేక్మాల్, జనవరి 20: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం టేక్మాల్‌లో క్షేత్రస్థాయిలో సర్వే తీరును స్వయంగా పరిశీలించారు. గ్రామంలోని పలు ఇండ్ల వద్దకు వెళ్లి ప్రజలతో మాట్లాడి, కుటుంబ వివరాలు అడిగారు. సర్వే చేస్తున్న విధి విధానాలు, ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారం, సర్వే విషయంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు, ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి అనువుగా లేని భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత వివరాల రికార్డులను తనిఖీ చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించడానికి అర్హులను గుర్తించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీవో విఠల్, ఏవో రాంప్రసాద్, ఆర్ఐ సాయిశ్రీకాంత్, టేక్మాల్ పంచాయతీ ఈవో రాకేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## బాలసదనం, భవిత కేంద్రం తనిఖీ



ఫిజియోథెరఫీని పరిశీలిస్తున్న జడ్జి జితేందర్

మెదక్ అర్బన్, జనవరి 20: జిల్లా కేంద్రంలోని స్టేడియం వద్ద ఉన్న బాలసదనం, భవిత కేంద్రాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ సోమవారం తనిఖీ చేశారు. ఇందులో ఉన్న పిల్లల చదువు, ఆరోగ్యం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, ప్యానెల్ న్యాయవాదులు కరుణాకర్, దుర్గారెడ్డి, మెదక్ డీసీపీవో సతీశ్ ఉన్నారు.

## బీసీ జాగృతి సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్



బీసీ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న బండి శేఖర్

మెదక్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : బీసీ జాగృత సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రేగోడ్ మండలం మర్పల్లి గ్రామానికి చెందిన బండి శేఖర్ నియామితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో నియామకపత్రాన్ని బీసీ దళపతి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అందజేశారు. శేఖర్ మాట్లా డుతూ తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన బీసీ దళపతి ఆర్.కృష్ణయ్యకు, బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువతతో కమిటీలు వేసి బీసీల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బేరి రామచంద్రయ్య యాదవ్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

రామాయంపేట/నర్సాపూర్/పాపన్నపేట, జనవరి 20: ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శ శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్లపై దాడులకు తెగబడుతున్న అల్లరి మూకలపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో టీచర్లు నిరసన వ్యక్తం చేశారు.

## నేటి నుంచి గ్రామాల్లో గ్రామసభలు

రామాయంపేట/నిజాంపేట, శివ్వంపేట, జనవరి 20: నేటి నుంచి 24 వ తేదీ వరకు గ్రామాల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం నిర్వహించే ప్రజాపాలన సమావేశాలపై వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ఆర్డీవో రమాదేవి అవగాహన కల్పించారు. సోమవారం రామయాంపేటలోని ఎస్సీ కాలనీ, గొల్పర్తి, కోమటిపల్లి, నిజాంపేటలోని రైతువేదికలో, శివ్వంపేటలో ప్రజాపాలన గ్రామ సమావేశాల్లో సమీక్ష నిర్వహించారు.